క్లుప్తంగా

నీలకంఠేశ్వరునికి అభిషేకం



నీలకంఠేశ్వరునికి అభిషేకం

ఉలవపాడు: మండల కేంద్రమైన ఉలవపాడు గ్రామంలోని నీలకంఠేశ్వరస్వామి దేవస్థానంలో సోమవారం నీలకంఠేశ్వరునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం 7 గంటలకు అభిషేకం నిర్వహించారు. స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు, అభిషేకం చేశారు. సాయంత్రం 6 గంటలకు నందీశ్వరునికి అభిషేకం జరిపారు. సర్వదోష నివృత్తి అభిషేక కార్యక్రమం నిర్వహించారు. కూరగాయల దండలు అలంకరించారు. ఈ కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు.

వాల్ పోస్టర్ ఆవిష్కరణ



వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న సీపీఎం కార్యదర్శి కొండయ్య, తదితరులు

కొండపి: సీపీఎం కొండపి మండల కార్యదర్శి మల్లెల మాలకొండయ్య సీపీఎం రాష్ట్ర 27వ మహాసభల వాల్‌పోస్టర్‌ను సోమవారం ఆవిష్కరించారు. ఫిబ్రవరి 1, 2, 3 తేదీల్లో నెల్లూరులో మహాసభలు జరుగుతున్నాయన్నారు. కార్యక్రమంలో మల్లెల పెద్ద పేతురు, కేజీ మస్తాన్ చిన్నారావు, వీరయ్య బాబూరావు, పచ్చాకు కూలీలు పాల్గొన్నారు.

తూర్పునాయుడుపాలెం విద్యార్థులకు అవార్డు



అవార్డు అందుకుంటున్న విద్యార్థులు

టంగుటూరు: గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఒంగోలు ఆంధ్రకేసరి కళాశాల ఆవరణలో నిర్వహించిన సంస్కార భారతి సాంస్కృతిక జిల్లా స్థాయి జాతీయ గీతాల పోటీల్లో టంగుటూరు మండలం తూర్పునాయుడుపాలెం ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు శరవణ్, షణ్ముఖి ప్రతిభ చూపారు. టంగుటూరు మండలం నుంచి పోటీల్లో పాల్గొని ప్రశంస పత్రాన్ని అందుకున్నారు. వీరిని టంగుటూరు సంస్కార భారతి మండల శాఖ ప్రతినిధులు శేషారావు, సురేష్, మనం ఫ్రెండ్స్ ఆర్గనైజేషన్ సభ్యులు ఎస్కే మాబు సుభాని, వినాయక ప్రసాదు, డాక్టర్ వంకాయలపాటి శ్రావణ్ కుమార్, షేక్ అలీ వెంకట్రావు, మాల్యాద్రి అభినందించారు.

ముండ్లమూరివారిపాలెంలో పశువైద్య శిబిరం



ముండ్లమూరివారిపాలెంలో గొర్రెలకు టీకాలు వేస్తున్న డాక్టర్ శివరామకృష్ణ

పొన్నలూరు: మండలంలోని ముండ్లమూరివారిపాలెం గ్రామంలో సోమవారం పశువైద్య శిబిరం నిర్వహించారు. పశువైద్యాధికారి శివరామకృష్ణ గేదెలు, గొర్రెలు, మేకలకు సాధారణ వైద్య పరీక్షలు, గర్భకోశ వ్యాధుల నిర్ధారణ, చూడి పరీక్షలు చేశారు. అలాగే గేదెలకు గొంతు వాపు వ్యాధి నిరోధక టీకాలు వేసి గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందులు తాపించారు.

మానవత సంస్థ ఆధ్వర్యంలో ఆర్థిక సాయం



ఆర్థిక సాయం చెక్కు అందజేస్తున్న సభ్యులు

పామూరు: మానవత స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో అనారోగ్యంతో ఉన్న వారికి సోమవారం సంస్థ అధ్యక్ష, కార్యదర్శులు మెడబలిమి మునలయ్య, ఎన్.బాబూరావులు ఆర్థిక సాయం చేశారు. మండలంలోని ఇనిమెర్ల గ్రామానికి చెందిన గాలంకి కొండయ్య కొంత కాలంగా అనారోగ్యంతో ఇబ్బందులు పడుతుండగా అతనికి వైద్య ఖర్చుల కోసం ఆర్థిక సహాయంలో భాగంగా చెక్కు అందజేశారు. కన్వీనర్ వి.వెంకటేశ్వరరెడ్డి, తోట రమేష్, పి.తిరుపతిరెడ్డి, తూరెడ్డి వెంకటేశ్వర్లు, రంగారెడ్డి, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

శిథిల భవనం.. దినదిన గండం

- పెచ్చులూడుతున్న అంగన్‌వాడీ కేంద్రం
- ఎప్పుడు ఊడిపడతాయో తెలియని పరిస్థితి
- అసంపూర్తిగా నిలిచిపోయిన నూతన భవనం



శిథిలావస్థకు చేరిన అంగన్‌వాడీ కేంద్రం నిర్వహిస్తున్న కమ్యూనిటీ హాలు భవనం

కందుకూరు రూరల్: మండలంలోని శ్రీరంగరాజపురం పంచాయతీలో ఉన్న మదనగోపాలపురంలోని అంగన్‌వాడీ కేంద్రం శ్లాబు పెచ్చులూడుతోంది. శ్లాబు పెచ్చులు ఎప్పుడు ఊడి పడతాయోననే భయంలో చిన్నారుల తల్లిదండ్రులు ఉన్నారు. అయినా ఆ భవనంలోనే అంగన్‌వాడీ కేంద్రాన్ని నిర్వహిస్తున్నారు. పెచ్చులూడిపడుతున్న భవనం ఆ గ్రామ కమ్యూనిటీ హాలు. దీనిలో అంగన్‌వాడీ కేంద్రాన్ని నడుపుతున్నాయి. ఈ కేంద్రానికి గ్రామానికి చెందిన సుమారు పది మంది చిన్నారులు కేంద్రానికి వస్తారు. అందులోనే ప్రీ స్కూల్ నిర్వహిస్తారు. ఈ చిన్నారులకు అంగన్‌వాడీ కార్యకర్త ఆటపాటలతో కూడిన విద్యను నేర్పిస్తుంటారు. ఆ భవనంలోనే వంట చేసి మధ్యాహ్న భోజనం చిన్నారులకు పెడుతున్నారు.

లోపలికి వెళ్లి చూస్తే భవనం శ్లాబు పెచ్చులూడి ఎప్పుడు ఊడి నెత్తినపడతాయోనని భయం భయంగా కేంద్రంలో అంగన్‌వాడీ కార్యకర్త, ఆయా, చిన్నారులు గడుపుతున్నారు. చిన్నారుల తల్లిదండ్రులు కూడా భవనంలోకి పిల్లలను పంపించాలంటే భయాందోళన చెందుతున్నారు. భవనంలో ఫ్లోరింగ్ రాళ్ల మధ్య కూడా సిమెంట్ లేచిపోయి మట్టి బయట పడి ఉంది. అంగన్‌వాడీ కేంద్రంతో పాటు పరిసరాలు పరిశుభ్రంగా ఉండాలి. ఈ కేంద్రం వద్ద అలాంటి పరిస్థితి కనిపించడం లేదు. ఇవేమీ పట్టని అంగన్‌వాడీ కార్యకర్త కేంద్రాన్ని అలానే నడుపుతున్నారు. అదే విధంగా భవనంలోని ముందు ఉన్న ఒక గదిలో పాడైన సిమెంట్ కట్టలు, చెత్తాచెదారం వేసి ఉంది. ఆ గదికి తలుపు కూడా సక్రమంగా లేదు. అందులో నుంచి విష పురుగులు వచ్చే ప్రమాదం ఉంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి శ్లాబులూడే భవనంలో నుంచి అద్దె భవనంలోకి అయినా కేంద్రాన్ని మార్చాలని గ్రామస్తులు కోరుతున్నారు.

అసంపూర్తిగా నిలిచిపోయిన నూతన భవనం..

గ్రామంలో ఉన్న మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఆవరణలో 2017లో రూ.4 లక్షలతో అంగన్‌వాడీ కేంద్ర నూతన భవనం నిర్మాణం ప్రారంభించారు. 2018 సంవత్సరం వరకు నిర్మించి కేవలం శ్లాబు వేసి వదిలేశారు. అప్పటి నుంచి ఆ భవనం అలానే అసంపూర్తిగా నిలిచిపోయి ఉంది. దీంతో అంగన్‌వాడీ కేంద్రం పాతబడిన కమ్యూనిటీ హాలులో నిర్వహిస్తున్నారు. భవనం నిర్మాణం పూర్తి చేస్తే పిల్లలు ఆడుకునేందుకు, పరిశుభ్రతగా బాగుటుందని గ్రామస్తులు అంటున్నారు.

దీనిపై ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ప్రభావతిని వివరణ కోరగా నూతన భవనం పూర్తి చేసేందుకు ఉన్నతాధికారులకు వివరాలు పంపించామన్నారు. ప్రస్తుతం ఉన్న భవనంలో ఫ్లోరింగ్‌ను బాగు చేయించుకోవాలని చెప్పామని తెలిపారు. శ్లాబు పెచ్చులూడుతుంటే అద్దె భవనంలోకైనా మార్చే ఏర్పాటు చేస్తామన్నారు.



అసంపూర్తిగా నిలిచిపోయిన నూతన భవన నిర్మాణం



పెచ్చులూడి పడుతున్న శ్లాబు



ఫ్యాను వద్ద పెచ్చులూడి పడేందుకు సిద్ధంగా ఉన్న శ్లాబు

ఎంఈఓ కార్యాలయాన్ని తనిఖీ చేసిన ఆర్జేడీ



టంగుటూరు ఎంఈవో కార్యాలయాన్ని తనిఖీ చేస్తున్న ఆర్జేడీ లింగేశ్వరరెడ్డి

టంగుటూరు: విద్యార్థుల సంఖ్య ఆధారంగా గ్రామ పంచాయతీలో కనీసం ఒక ఆదర్శ పాఠశాల ఉండేలా ప్రణాళిక తయారు చేయాలని విద్యాశాఖ గుంటూరు ఆర్జేడీ లింగేశ్వరరెడ్డి సూచించారు. టంగుటూరులోని మండల విద్యాశాఖ కార్యాలయాన్ని సోమవారం ఆకస్మికంగా ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యాశాఖ కమిషనర్ ఆదేశాల మేరకు ఇక నుంచి ఉన్నత పాఠశాలలో చదువుతున్న 3, 4, 5 తరగతుల విద్యార్థులను స్థానిక ప్రాథమిక పాఠశాలలో కలపాలని, ప్రైమరీలో 60 మంది కంటే ఎక్కువ విద్యార్థులుంటే దానిని ఆదర్శ పాఠశాలగా మార్చాలని, అందులో 5 క్లాసులకు ఐదుగురు ఉపాధ్యాయులు ఉంటారని తెలిపారు. దానివలన గుణాత్మక విద్య అందించవచ్చన్నారు. 6, 7, 8 తరగతులలో 60 మందిలోపు విద్యార్థులుంటే ఆ ప్రాథమికోన్నత పాఠశాలను ప్రైమరీ చేయాలని, 60 మందికిపైగా విద్యార్థులుండి ఆట స్థలం, సొంత భవనాలు ఉంటే ఆ ఉన్నత పాఠశాలను హైస్కూల్‌గా అప్‌గ్రేడ్ చేయాలని కోరారు. ఈ సందర్భంగా ఆయా పాఠశాలల్లో ఎంత రోల్ ఉందో పరిశీలించారు. ఎక్కడైనా విద్యార్థుల బోగస్ ఎన్‌రోల్ ఉంటే ఆ ప్రధానోపాధ్యాయులపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో ఒంగోలు ఉప విద్యాశాఖాధికారి చంద్రమౌళీశ్వరరావు, డీసీఈబీ సెక్రటరీ శ్రీనివాస్, ఎంఈఓలు చెంచు పున్నయ్య, తన్నీరు బాలాజీ, క్లస్టర్ ప్రధానోపాధ్యాయులు తులసి ప్రభ, సుధారాణి పాల్గొన్నారు.

పొగాకులో అన్య పదార్థాలు తొలగించాలి



ముండ్లమూరివారిపాలెంలో క్యూరింగ్ జరిగిన పొగాకును పరిశీలిస్తున్న అధికారులు

పొన్నలూరు: పొగాకులోని అన్య పదార్థాలను క్షేత్ర స్థాయిలోనే గుర్తించి రైతులు తొలగించాలని కందుకూరు వేలం కేంద్రం నిర్వహణాధికారి కిరణ్ సూచించారు. మండలంలోని ముండ్లమూరివారిపాలెం గ్రామంలో సోమవారం ఆకు రేల్చు, క్యూరింగ్, గ్రేడింగ్ విధానాలపై పొగాకు రైతలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల కురిసిన వర్షాలకు ముదురు పొగాకు తోటలు దెబ్బతినడం వలన అడుగు ఆకులు వదిలేసి పక్వానికి వచ్చిన ఆకులను మాత్రమే కొట్టాలన్నారు. గ్రేడింగ్ సమయంలో బుట్టలను అందుబాటులో ఉంచుకుని అన్య పదార్థాలను వాటిలో వేయాలన్నారు. పొగాకు క్యూరింగ్ సమయంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో గ్రేడింగ్ సీనియర్ అధికారి శివకుమార్, ఐటీసీ మేనేజర్ వెంకటేశ్వరరావు, జీపీఐ మేనేజర్ ఉన్నం శ్రీనివాస్, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ప్రత్యేక శిబిరానికి 125 మంది హాజరు



మాట్లాడుతున్న దివ్యాంగుల సంక్షేమశాఖ సహాయ సంచాలకులు అర్చన

కొండపి : స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సోమవారం వివిధ రకాల ఉపకరణాల అవసరార్థం దివ్యాంగులు, వయోవృద్ధులకు నిర్వహించిన శిబిరానికి 120 మందికిపైగా హాజరయ్యారు. దివ్యాంగుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు జి.అర్చన పాల్గొని మాట్లాడుతూ కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశాల మేరకు ఈ శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కొండపి నియోజకవర్గంలో రెండు శిబిరాలు ఏర్పాటు చేశామని చెప్పారు. ఒకటి కొండపిలో కాగా, మరొకటి సింగరాయకొండలో ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. కొండపిలోని శిబిరానికి పొన్నలూరు, కొండపి, మర్రిపూడి మండలాల వారు హాజరయ్యారని తెలిపారు. మంగళవారం సింగరాయకొండలో ఈ శిబిరాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. జరుగుమల్లి, టంగుటూరు, సింగరాయకొండ మండలాల వారు హాజరై సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మండల అభివృద్ధి కార్యాలయ ఏవో రామకృష్ణ, విద్యాశాఖ అధికారి రామారావు, ఐఆర్టీ కో ఆర్డినేటర్లు, పంచాయతీ సెక్రటరీ అంకయ్య, కృష్ణారెడ్డి, స్వామిదాస్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ నేతకు జూపూడి, మాదాసి నివాళులు



ఆదిరెడ్డి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న డాక్టర్ మాదాసి వెంకయ్య, బత్తుల అశోక్‌కుమార్‌రెడ్డి



ఆదిరెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న జూపూడి ప్రభాకరరావు

కొండపి: మండలంలోని కే ఉప్పలపాడు గ్రామంలో వైఎస్సార్ సీపీ నాయకుడు వాకా ఆదిరెడ్డి ఇటీవల మృతిచెందగా, సోమవారం దశదినకర్మ నిర్వహించారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జూపూడి ప్రభాకర్‌రావు, పీడీసీసీ బ్యాంక్ మాజీ చైర్మన్ డాక్టర్ మాదాసి వెంకయ్య పాల్గొని ఆదిరెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆదిరెడ్డి కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతి తెలిపి ఆదరించారు. కార్యక్రమంలో పార్టీ వైద్య విభాగం రాష్ట్ర మాజీ అధ్యక్షుడు బత్తుల అశోక్‌కుమార్‌రెడ్డి, మండల సీనియర్ నాయకులు బొక్కిసం సుబ్బారావు, చింతల ఎక్స్‌పోర్ట్ అధినేత చింతల వెంకటేశ్వర్లు, దివి శ్రీనివాసరావు, కల్లూరి హరిబాబు, సుధాకర్, నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పాఠశాల అభివృద్ధికి ప్రణాళికలు తయారు చేయండి



మాట్లాడుతున్న దేవిరెడ్డి రామిరెడ్డి

వెలిగండ్ల (కనిగిరి రూరల్): పాఠశాల అభివృద్ధి ప్రణాళికలను, హ్యాబిటేషన్ ప్లాన్‌ను తక్షణమే తయారు చేసి నివేదికలు ఇవ్వాలని ఎంఈఓల సంఘ జిల్లా అధ్యక్షుడు దేవిరెడ్డి రామిరెడ్డి అన్నారు. స్థానిక ఎంఈఓ కార్యాలయంలో సోమవారం ప్రధానోపాధ్యాయుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా దేవిరెడ్డి రామిరెడ్డి మాట్లాడూత మైక్రో ప్లాన్‌తో పాఠశాలలకు కావాల్సిన మౌలిక సదుపాయాలకు పంపిన బడ్జెట్‌కు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా నిధుల మంజూరు చేస్తారని తెలిపారు. వివిధ పాఠశాలల హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

అవార్డు అందుకున్న హెడ్ కానిస్టేబుల్‌కు సన్మానం



కొండపిలో హెడ్ కానిస్టేబుల్ కోటేశ్వరరావును సన్మానిస్తున్న సీఐ సోమశేఖర్, ఎస్సై ప్రేమ్‌కుమార్



ఎస్పీ చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న టంగుటూరు పీఎస్ హెడ్ కానిస్టేబుల్ వెంకట్రావు

కొండపి: స్థానిక పోలీస్ స్టేషన్లో పనిచేస్తున్న హెడ్ కానిస్టేబుల్ కే కోటేశ్వరరావు ఆదివారం ఒంగోలులో నిర్వహించిన గణతంత్ర దినోత్సవంలో ఉత్తమ సేవా పురస్కారం అందుకున్న సందర్భంగా సోమవారం స్థానిక పోలీస్ స్టేషన్లో సీఐ సోమశేఖర్, ఎస్సై ప్రేమ్ కుమార్ ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కోటేశ్వరరావును ఆదర్శంగా తీసుకుని స్టేషన్లోని సిబ్బంది పనిచేయాలని కోరారు. కార్యక్రమంలో ఏఎస్ఐ అంకారావు, హెడ్ కానిస్టేబుల్ వెంకటేశ్వర్లు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

టంగుటూరులో హెడ్ కానిస్టేబుల్‌కు అభినందనలు...

టంగుటూరు: గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని ఒంగోలు పోలీసు పరేడ్ గ్రౌండ్స్‌లో ఆదివారం నిర్వహించిన అవార్డుల ఉత్సవంలో టంగుటూరు పోలీసు స్టేషన్లో విధులు నిర్వహిస్తున్న హెడ్ కానిస్టేబుల్ సిగినం వెంకట్రావు ఉత్తమ సేవా అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా అతనికి టంగుటూరు ఎస్సై నాగమల్లీశ్వరరావు, పోలీసు సిబ్బంది అభినందనలు తెలిపారు.

మెప్మా అర్బన్ మార్కెట్‌ను సందర్శించిన కమిషనర్



స్టాల్స్‌ను సందర్శిస్తున్న కమిషనర్ అనూష

కందుకూరు: కందుకూరు మున్సిపాలిటీ పరిధిలో మెప్మా ఆధ్వర్యంలో సోమవారం మెప్మా అర్బన్ మార్కెట్‌ను ఏర్పాటు చేశారు. ఈ మార్కెట్‌ను మున్సిపల్ కమిషనర్ కె.అనూష సందర్శించారు. స్వయం సహాయ సంఘాల మహిళలు స్వయంగా తయారు చేసిన ఉత్పత్తులను ఈ మార్కెట్ ద్వారా విక్రయించి ఉపాధి పొందడం అభినందనీయమన్నారు. సుమారు 20 స్టాల్స్ ఏర్పాటు చేశారు. మహిళలు మరిన్ని ఉత్పత్తులు తయారు చేయాలని సూచించారు. కార్యక్రమంలో మెప్మా అధికారులు ఎం.సంపత్ కుమార్, సీఓలు ఆర్పీలు, టీఎల్ఎఫ్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు మంత్రి శంకుస్థాపన



శంకుస్థాపనలో మంత్రి స్వామి, ఎమ్మెల్యే ఉగ్ర

కనిగిరి రూరల్: రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా బాలవీరాంజనేయ స్వామి.. ఎమ్మెల్యే ఉగ్ర నరసింహారెడ్డితో కలిసి మండలంలోని పలు అభివృద్ధి కార్యక్రమాల్లో సోమవారం పాల్గొన్నారు. కంచర్లవారిపల్లి జెడ్పీ బాలికోన్నత పాఠశాలను మంత్రి సందర్శించి మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. పీఎం శ్రీ పథకం కింద రూ.64.70 లక్షల విలువైన అదనపు గదుల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. క్రీడా మైదానానికి రూ.5 లక్షల కేటాయింపునకు మంత్రి హామీ ఇచ్చారు. అనంతరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలను సందర్శించి నూతన భవనాల నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు. కళాశాలలో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం రూ.5 కోట్లు మంజూరు చేసినట్లు చెప్పారు. ఏపీఈడబ్ల్యూ ఐడీసీఈఈ పి.భాస్కర్ రావు, డీఈఈ జగన్‌మోహన్‌రావు, స్థానిక నాయకులు పాల్గొన్నారు. మంత్రి వీరాంజనేయ స్వామికి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బాలికల వసతి గృహం మంజూరు చేయాలని మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్ విన్నవించారు. వివిధ సమస్యలతో డీహెచ్‌పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి పందిటి మోహన్ వినతిపత్రం అందచేశారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సామాజిక భవనాన్ని కనిగిరిలో ఏర్పాటు చేయాలని వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి అధ్యక్షుడు కొటికల బాదుర్లా, కోటపాటి రమణలు మంత్రికి వినతిపత్రం అందజేశారు.

పీసీపల్లి: మండల పరిధిలోని పలు సీసీ రోడ్లను మంత్రి డోలా బాలవీరాంజనేయ స్వామి, కనిగిరి ఎమ్మెల్యే ఉగ్ర నరసింహారెడ్డిలు సోమవారం ప్రారంభించారు. కస్తూరిబా పాఠశాల రోడ్డు, పీసీపల్లి తహసీల్దార్ కార్యాలయం రోడ్డు, కమ్మవారిపల్లి రోడ్లను ప్రారంభించారు. మండల అధ్యక్షుడు వేమూరి రామయ్య, పులి ప్రతాప్, రామకష్ట, జోసఫ్, వేమూరు సుబ్బారావు, గుర్రం మాలి లింగారెడ్డి పాల్గొన్నారు.

300 మంది విద్యార్థులకు స్టడీమెటీరియల్ పంపిణీ



పది విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేస్తున్న దాత, ఎంఈఓ

హనుమంతునిపాడు: చిట్యాల వెలుగొండారెడ్డి చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో చైర్మన్, వైఎస్సార్ సీపీ నాయకులు చిట్యాల విజయభాస్కర్‌రెడ్డి పదో తరగతి చదువుతున్న 300 మంది విద్యార్థులకు డీసీఈబీ స్టడీ మెటీరియల్‌ను సోమవారం నియోజకవర్గ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి దద్దాల నారాయణ ఆధ్వర్యంలో అందజేశారు. ముప్పాళ్లపాడు, నందనవనం, సీతారాంపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో చదువుతున్న 10వ తరగతి విద్యార్థులు 280 మందికి, దొడ్డిచింతల ఎయిడెడ్ పాఠశాలలో చదువుతున్న 20 మంది విద్యార్థులకు అందజేశారు. స్టడీ మెటీరియల్ మండల విద్యాశాఖాధికారులు జి.పెద్దిరాజు, ఎస్.రమణయ్యల సమక్షంలో పంపిణీ చేశారు. ఎంఈఓలు పెద్దిరాజు, రమణయ్య మాట్లాడుతూ చిట్యాల వెలుగొండారెడ్డి చారిటబుల్ ట్రస్టు ద్వారా చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి అందిస్తున్న స్టడీ మెటీరియల్ పరీక్షల సమయంలో విద్యార్థులకు మంచి ఫలితాలు సాధించేందుకు ఉపయోగ పడుతుందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులను దృష్టిలో ఉంచుకుని వైఎస్సార్ సీపీ నాయకులు విజయభాస్కర్‌రెడ్డి మంచి మెటీరియల్ అందజేస్తున్నందుకు అభినందలు తెలిపారు. సొంత మండలంలోని విద్యార్థులకు తోడ్పటం చాలా సంతోషంగా ఉందని వైఎస్సార్ సీపీ నాయకులు, ట్రస్టు చైర్మన్ చిట్యాల విజయభాస్కర్‌రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ట్రస్టు ద్వారా మరిన్ని సేవా కార్యక్రమాలు చేస్తామన్నారు. ప్రతి పాఠశాలలో 10వ తరగతి పరీక్ష ఫలితాల్లో మొదటి ర్యాంక్ సాధించిన విద్యార్థికి రూ.5 వేలు, రెండో ర్యాంక్ సాధించిన విద్యార్థికి రూ.3 వేలు బహుమతిగా ప్రకటిస్తామన్నారు. మండల స్థాయిలో మొదటి ర్యాంక్ సాధించిన విద్యార్థికి, తల్లిదండ్రులు లేని పిల్లలకు ట్రస్టు తరఫున ఇంటర్మీడియెట్ ఫీజు ట్రస్టు ద్వారా చెల్లిస్తామని ప్రకటించారు. అనంతరం హెచ్‌ఎంలు దాత విజయభాస్కరెడ్డిని ఘనంగా సన్మానించారు. మండల కన్వీనర్ యక్కంటి శ్రీనివాసలరెడ్డి, మండల రైతు సంఘ అధ్యక్షుడు శ్యామల సాంబిరెడ్డి, యూత్ అధ్యక్షుడు దాసరిపల్లి సర్పంచ్ భవనం కృష్ణారెడ్డి, మండల సర్పంచ్‌ల సంఘ అధ్యక్షుడు సానికొమ్ము మధుసూదన్‌రెడ్డి, ముప్పాళ్లపాడు సర్పంచ్ కొటికల అంకాలమ్మ, లింగపూజ, ఎస్సీ సెల్ అధ్యక్షుడు వేశపోగు గురుప్రసాద్, మండల సర్పంచ్‌ల సంఘ అధ్యక్షుడు సానికొమ్ము మధుసూదన్‌రెడ్డి, హెచ్‌ఎంలు పద్మావతి, ఏరువ వెంకటరెడ్డి, బి.నరసింహులు, బూత్ కమిటీ సభ్యులు కస్తాల బాలాజీ, రమణారెడ్డి, మోహన్‌రెడ్డి, మాజీ కో ఆప్షన్ సభ్యుడు షేక్ మౌలాలీ, దేవిరెడ్డి వెంకట స్వామిరెడ్డి, రమణారెడ్డి, బీసీ నాయకులు కేతిబోయిన వెంకట కాశయ్య, కె.నారాయణ, వెలుగొండయ్య పాల్గొన్నారు.

హెల్మెట్‌లు ధరించి ప్రాణాలు రక్షించుకోండి

వెలిగండ్ల (కనిగిరి రూరల్): వాహనదారులు తప్పని సరిగా హెల్మెట్లు ధరించాలని పోలీసు అధికారులు పేర్కొన్నారు. వెలిగండ్ల బస్టాండ్ సెంటర్‌లో సోమవారం రాత్రి హెల్మెట్‌ల ధరించాలని కోరుతూ వాహన దారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వాహన దారులు హెల్మెట్లను ధరించి ప్రాణాలు రక్షించుకోవాలన్నారు. సురక్షితంగా గమ్యస్థానాలకు చేరాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పోలీస్ కానిస్టేబుళ్లు అచ్చిరెడ్డి, సాల్కిన్ పాల్గొన్నారు.

మౌలిక వసతులు కల్పించాలి



కమిషనర్‌కు వినతిపత్రం అందిస్తున్న ఐక్యవేదిక నాయకులు

కనిగిరి రూరల్: సూరాపాపిరెడ్డి కాలనీలో మౌలిక వసతులు కల్పించాలని కోరుతూ ప్రజా సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో సోమవారం కమిషనర్ డానియల్ జోసఫ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వీధిలైట్లు, నీరు, రోడ్లు, డ్రైనేజీ కాలువలు, సాగర్ జలాలు తదితర సమస్యలు తక్షణ పరిష్కరించాలని, అలుగు వాగు ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలని వినతి పత్రంలో కోరారు. ఐక్యవేదిక కన్వీనర్ పీసీ కేశవరావు, ఆర్.ఏడుకొండలు, పి.చెన్నమ్మ, సామేలు, మధు, సుబ్బమ్మ, సుశీల, మేరి గురవయ్య పాల్గొన్నారు.

నూరు శాతం ఫలితాలపై దృష్టిసారించాలి



టెస్ట్ పేపర్స్ పంపిణీ చేస్తున్న హెచ్‌ఎం, యూటీఎఫ్ నాయకులు

సీఎస్‌పురం (పామూరు): టెన్త్‌లో నూరు శాతం ఫలితాలపై విద్యార్థులు దృష్టి సారించాలని అరివేముల జెడ్పీ హెచ్ఎస్ హెచ్‌ఎం జి.సుప్రజ, యూటీఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి షేక్ పాదుషా అన్నారు. యూటీఎఫ్ ఆధ్వర్యంలో టెన్త్ విద్యార్థుల కోసం రూపొందించిన టెస్ట్ పేపర్స్‌ను దాతలు మాదినేని శ్రీనివాసులు సమకూర్చగా సోమవారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో వాటిని విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు దాతల సాయాన్ని ఉపయోగించుకుని ప్రైవేటు పాఠశాలల విద్యార్థులకంటే మెరుగైన ఫలితాలు సాధించాలని సూచించారు. యూటీఎఫ్ నాయకులు కె.వెంకటేశ్వర్లు, హస్తి వీరాంజనేయులు, ఆర్.వెంకటేశ్వర్లు, పాఠశాల ఉపాధ్యాయులు ప్రసాద్, ఎస్వీ నారాయణ పాల్గొన్నారు.